ఖాళీ జాగా.. వేసేయ్ పాగా..!

గండిమైసమ్మ-దుండిగల్ మండలంలో భూముల ధరలకు రెక్కలు..కబ్జాదారుల కన్ను

- యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- గంటల వ్యవధిలోనే ఇంటి నంబర్, కరెంట్ మీటరు
- అప్పుడప్పుడు కూల్చివేతలతో మమ అనిపిస్తున్న అధికారులు

దుండిగల్:

గండిమైసమ్మ-దుండిగల్ మండలంలో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. ఇంతా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు అడపా దడపా అక్రమ నిర్మాణాలను కూల్చి వేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలపరిధిలో జరుగుతున్న భూకబ్జాలపై 'సాక్షి' కథనం..



చర్చిగాగిల్లాపూర్‌లోని శ్మశానవాటిక పక్కనే చదును చేసిన దృశ్యం

శరవేగంగా అభివృద్ధి..

మండలపరిధిలోని మల్లంపేట, భౌరంపేట, దుండిగల్, డిపోచంపల్లి, గాగిల్లాపూర్, బహదూర్‌పల్లి, దూలపల్లి, కొంపల్లి ఒకప్పుడు గ్రామాలుగా ఉండేవి. పట్టణీకరణ నేపథ్యంలో 2019లో మున్సిపాలిటీలుగా ఏర్పడ్డాయి. అప్పటి నుంచి ఈ ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. గతంలో ఇక్కడి వ్యవసాయ భూముల్లో ప్రస్తుతం భారీ బహుళ అంతస్తులు, వెంచర్లు, విల్లాలు, అపార్ట్‌మెంట్లు వెలిశాయి.

భూముల ధరలకు రెక్కలు..

ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందడంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. రియల్ ఎస్టేట్ రంగంతో గతంలో వందల్లో ఉన్న గజం విలువ ప్రస్తుతం లక్షల్లో పలుకుతున్నది. ప్రాంతాన్ని బట్టి ఇక్కడ ఒక్కో ఎకరా రూ.5 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

ప్రభుత్వ స్థలాలపై కన్ను..

భూముల ధరలు కోట్లకు చేరడంతో కబ్జాదారుల కన్ను ప్రభుత్వ స్థలాలపై పడింది. రాజకీయ నాయకుల అండదండలతో కొందరు రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని విలువైన భూములను కబ్జా చేస్తున్నారు. 60, 80 గజాలుగా ప్లాట్లను విభజించి వాటిని విక్రయిస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం..

సర్వే నంబర్ 214, 120 ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను పంపించి కూల్చివేయిస్తున్నాం. మల్లంపేటలో 3, 4 రోజుల క్రితమే కూల్చివేశాం. కబ్జాదారులపై కేసులు సైతం నమోదు చేసి ప్రభుత్వ స్థలాలను పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.

– సయ్యద్ మతీన్, గండిమైసమ్మ-దుండిగల్ మండల తహసీల్దార్

గంటల వ్యవధిలోనే ఇంటి నంబర్, కరెంట్ మీటరు..

కబ్జాదారులకు అధికారులు సహకరిస్తున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రికి రాత్రే నిర్మించిన అక్రమ నిర్మాణాలకు ఉదయం వరకే ఇంటి నంబర్, కరెంటు మీటర్లు వచ్చేస్తున్నాయి. సామాన్యులు కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగినా కానీ పనులు ఇక్కడి కబ్జాదారులకు మాత్రం గంటల వ్యవధిలోనే అనుమతులు రావడం గమనార్హం.

కూల్చివేతలతో మమ..

స్థానికులు, ప్రతిపక్ష నేతలు ఫిర్యాదులు చేస్తే.. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు మాత్రం అధికారులు హడావిడి చేస్తారు. వెంటనే సదరు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తారు. తిరిగి మళ్లీ సదరు కబ్జాదారులు నిర్మాణాలు చేపట్టినా చూసి చూడనట్లు వ్యవహరిస్తారు.

మచ్చుకు కొన్ని..

- డిపోచంపల్లి సర్వే నంబర్ 120లో సుమారు 100 ఎకరాలకు పైగానే ప్రభుత్వ స్థలం ఉండేది. ప్రస్తుతం ఇక్కడే మండల రెవెన్యూ, మున్సిపల్, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్ శాఖల కార్యాలయాలు ఉన్నాయి. వీటికి కూత వేటు దూరంలోని 120లో 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. ఇక్కడా ఏకంగా 10కి పైగా కాలనీలు, బస్తీలు ఏర్పడ్డాయి.
- చర్చిగాగిల్లాపూర్ సర్వే నంబర్ 214లోని దాదాపు 40 ఎకరాలకు పైగా కబ్జాకు గురై పలు కాలనీలు వెలిశాయి.
- మల్లంపేటలోని సర్వే నంబర్ 170లో ఓ వ్యక్తి ఆరు ఎకరాలకు పైగా రైతుల నుంచి అసైన్డ్ స్థలాన్ని కొనుగోలు చేసి ఏకంగా 80కి పైగానే గదులు నిర్మించాడు.
- చర్చిగాగిల్లాపూర్‌లో శ్మశానవాటికకు వెళ్లే దారిలో రోడ్డుకిరువైపులా 2 వేల గజాల్లో నిర్మాణాలు చేపడుతున్నారు.
- భౌరంపేటలోని సర్వే నంబర్ 472లో మొత్తం 31.34 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉండగా అప్పట్లో 10 ఎకరాలను సబ్ స్టేషన్‌కు, ఏడు ఎకరాలను దిల్ సంస్థకు కేటాయించారు. మిగిలిన స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది.
- భౌరంపేట సర్వే నంబర్ 166/9లో 4.38 ఎకరాలకు ఎన్‌ఓసీ ఉందంటూ ఓ వ్యక్తి 160/1, 166/7, 166/8లో ఫెన్సింగ్, గేటు నిర్మించాడు. స్థానిక నేతల ఫిర్యాదుతో అధికారులు వాటిని కూల్చివేశారు.
- మల్లంపేటలోని సర్వే నంబర్ 170లో ఓ బడా నిర్మాణ సంస్థ ప్రభుత్వ భూమిలో విల్లాలు నిర్మించేందుకు యత్నించగా అధికారులు నిర్మాణ దశలోనే కూల్చివేశారు.
- ప్రస్తుతం మల్లంపేట, సర్వే నంబర్ 120, 214లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సర్కారు భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



దీపోచంపల్లి సర్వే నం.120లో అక్రమ నిర్మాణం



120లో ఇటీవల అధికారులు కూల్చివేసిన నిర్మాణం



మల్లంపేట సర్వే నంబర్ 170లో చేపట్టిన అక్రమ నిర్మాణాలు

సమస్య పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యేకు వినతి



కూన శ్రీశైలంగౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్‌లోని సుభాష్ చంద్రబోస్‌నగర్ 'ఏ'లో డంపింగ్ వ్యర్థాల బారి నుంచి కాపాడాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాంనగర్‌కాలనీ, పోచమ్మ గుడి వెనుక హెచ్‌ఎంటీ మైదానంలోని కెమికల్ కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలను కాలబెడుతున్నారని దీనివల్ల జలుబు, దగ్గుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో నవ యుగ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ జహంగీర్ హుస్సేన్ , ప్రెసిడెంట్ బల్‌రాం, రాజు, సలీం తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా సుభాష్‌నగర్ టీటీసీఎస్ నూతన కమిటీ సభ్యులు కూన శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి శ్రీనివాస్ గౌడ్, కర్రెగోని రాజేశ్, జే నరసింహ గౌడ్, ఎం.నాగభూషణం, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి



మాట్లాడుతున్న కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పేదల పక్షపాతి ప్రభుత్వం అని కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్ అన్నారు. కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్స్‌లో 'ఇందిరమ్మ ఇళ్ల స్కీం' కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తమ ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా రూ.2,500, గ్యాస్ సిలిండర్లపై రూ.500 సబ్సిడీ, రైతు భరోసా, గృహజ్యోతి, యువ వికాసం వంటి పథకాలతో ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అర్హులకే అందేలా నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శివకుమార్‌గౌడ్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ జెమ్మి దేవేందర్, పాక్స్ డైరెక్టర్ నరేందర్, మాజీ వార్డ్ మెంబర్లు కావాలి గోపాల్, సన్న శ్రీనివాస్, నాయకులు సుదర్శన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నాగరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న స్టాలిన్ బాబు

జీడిమెట్ల: సాబూరి ఫార్మా పరిశ్రమలో బుధవారం మృతిచెందిన రాము, లక్ష్మణ్ కుటుంబ సభ్యులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్ బాబు పరామర్శించారు. ఆయన గురువారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ప్రమాదం తీరును పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన సాబూరి పరిశ్రమ మేనేజ్‌మెంట్‌పై కఠిన చర్యలు తీసుకుని మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

చేతి సంచుల ఆవిష్కరణ



చేతి సంచులను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

సుభాష్‌నగర్: పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్ లయన్ కోటి రెడ్డి కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ అబ్దుల్ రహమాన్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బట్టతో తయారు చేసిన చేతి సంచులను ఆయనతో ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ నిత్యావసరాలు, కూరగాయలు కొనుగోలు చేసే క్రమంలో చేతి సంచీలు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ సంచులతో కేన్సర్ వచ్చే అవకాశం ఉన్నందున వాటిని నిషేధించాలన్నారు. కార్యక్రమంలో లియో లయన్ అన్నెం తనూజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఘనంగా వాల్మీకి జయంతి

సుభాష్‌నగర్: సంస్కృత సాహిత్యంలో ఆది కవిగా పేరుపొంది రామాయణాన్ని రచించిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను సూరారం నార్త్ సిటీ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కోలా వెంకటేశ్వర్ వాల్మీకి జీవితాన్ని విద్యార్థులకు వివరించారు. లోక కల్యాణం కోసం సమాజాన్ని ధర్మ మార్గంలో నడిపించేందుకు వాల్మీకి రచించిన రామాయణం అద్భుతం అని కొనియాడారు.



వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న సూరారం నార్త్ సిటీ స్కూల్ విద్యార్థులు

ప్రభుత్వ భూముల కబ్జాను అడ్డుకోవాలి

సుభాష్‌నగర్: ఎమ్మెల్యే అనుచరుడు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్లాట్లు విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకుడు ఆకుల సతీశ్ ఆరోపించారు. గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌ను ఆనుకుని సర్వే నంబర్ 307లో మసూద్ అనే వ్యక్తి 16 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్లాట్లు చేసి విక్రయిస్తున్నాడని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ డీటీకి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ బాలయ్యనగర్‌కు ఆనుకుని ఉన్న క్వారీగుంతలను కొన్ని రోజులుగా మట్టితో పూడ్చి 477 ప్లాట్లుగా చేశారన్నారు. సుమారు రూ.150 కోట్ల విలువ చేసే స్థలాన్ని కబ్జాచేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నిరుపేదలు వాటిని కొనుగోలు చేసి మోసపోకముందే అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు శ్రీనివాస్ గౌడ్, అరుణ్ రావు, చందు, బలరామ్ తదితరులు ఉన్నారు.



డీటీకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకుడు సతీశ్ తదితరులు

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావుకు సమస్యలను విన్నవిస్తున్న మైనార్టీలు

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలో ఖబ్రస్థాన్‌ను నిర్మించాలని పలువురు ముస్లింలు కోరారు. ఈమేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ తుడుం పద్మారావును గురువారం కలిసి విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు సొంత ఊర్లకు తీసుకు వెళ్లలేక స్థానికంగా స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గండి మైసమ్మలో ఉన్న ఖబ్రస్తాన్‌లో బహదూర్‌పల్లి ముస్లింలకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అదేవిధంగా ఆదివారం ఇందిరమ్మ కాలనీ వద్ద జరగనున్న గార్మి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందించారు.

కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రేపన్ గిరిబాబు, చైర్మన్‌గా ముత్యాలు, సలహాదారులుగా జీ గణేశ్, వేముల సురేశ్, విజయసాగర్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వీర్ల సాయిబాబా, ఉపాధ్యక్షులుగా పబ్బా నరేశ్‌కుమార్, కే నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ప్రసాద్ నాయక్, సంయుక్త కార్యదర్శిగా వై.మల్లేశ్, కోశాధికారిగా టీ వెంకటేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.దేవరాజును ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కేటీఆర్‌ను కలిసిన నాయకులు



కేటీఆర్‌తో శంభీపూర్ కృష్ణ

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నందినగర్‌లోని ఆయన నివాసంలో పలువురు ప్రముఖులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పుష్ప గుచ్ఛం అందజేశారు.

వ్యక్తి అదృశ్యం

కుత్బుల్లాపూర్: మతిస్థిమితం లేని వ్యక్తి తప్పిపోయిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్ర రాఘవేంద్రకాలనీకి చెందిన షేక్ మహబూబ్ కుమారుడు షేక్ మదీనాబాషా (43) వృత్తిరీత్యా టైలర్. కాగా ఈ నెల 16న బయటకు వెళ్లిన మదీనా భాషా తిరిగి ఇంటికి రాలేదు. కొంతకాలంగా అతనికి మతిస్థిమితం సరిగా లేదని, ఆచూకీ కనుగొనాలని కోరుతూ కుటుంబ సభ్యులు గురువారం పేట్‌బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి



కొంపల్లిలో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో దాదాపు రూ. 61 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, పార్కు సుందరీకరణ, ఓపెన్ జిమ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్‌తో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు చింతల దేవేందర్ యాదవ్, తెల్ల కృష్ణవేణి వినోద్ కుమార్, డప్పు కిరణ్, లక్ష్మణ్ గౌడ్, శివ గౌడ్, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్ మధుసూదన్, బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కే శ్రీహరి, డీఈ నరేశ్ పాల్గొన్నారు. అదేవిధంగా పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు వివేకానంద్‌ను కలిసి పలు వినతులు, ఆహ్వాన పత్రికలు అందజేశారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న పనులపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్వంసమైన రోడ్లు, కొత్త డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తి చేసే విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అదే విధంగా నిలిచిపోయిన పనులపై దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటరీ, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన సభ్యులు..

డబుల్‌బెడ్రూం సముదాయంలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బాచుపల్లి డబుల్‌బెడ్రూం సొసైటీ సభ్యులు మేయర్ నీలారెడ్డిని కలిసి విన్నవించారు. దీనిపై మేయర్ సానుకూలంగా స్పందించారు.

బాధ్యతల స్వీకరణ



సుభాష్‌నగర్: మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా దూలపల్లి కాకర బ్యాంక్ చైర్మన్ గరిచే నరేందర్ రాజు నియమితులయ్యారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ పాలకవర్గ పదవీ కాలం ఇటీవల ముగియడంతో కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులోభాగంగా పీఏసీఎస్ దూలపల్లి చైర్మన్ గరిసె నరేందర్ రాజు మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా గురువారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేడ్చల్ మార్కెట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థుల్లో పరిజ్ఞానం పెంపునకే ఒప్పందం

నిజాంపేట్: విద్యార్థులకు పరిశ్రమల పరిజ్ఞానాన్ని అందించేందుకు బజా ఎస్ఏఈ ఇండియాతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని బీవీఆర్‌ఐటీ చైర్మన్ కేవీ విష్ణురాజు అన్నారు. వారిద్దరూ సంయుక్తంగా ఈబజా ఎస్ఏఈ ఇండియా-2025ను గురువారం కళాశాల ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ విష్ణురాజు, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ బజా ఎస్ఏఈ ఇండియాతో ఎంఓయూ ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈబజా ఎస్ఏఈ ఇండియా-2025ను హోస్ట్‌చేయడం గర్వకారణంగా ఉందని, దీని ద్వారా బీవీఆర్‌ఐటీ పోటీ, ఆవిష్కరణలకు శక్తివంతమైన కేంద్రంగా మారిందన్నారు. 4 రోజుల పాటు జరగనున్న ఈవెంట్‌లో దేశవ్యాప్తంగా ఉన్న పలు కళాశాలలకు చెందిన జట్లు ఎలక్ట్రిక్ ఆల్‌టెరైన్ వెహికల్స్ రూపకల్పన నైపుణ్యాన్ని ప్రదర్శించానున్నాయన్నారు. ఎంఓయూతో తమ విద్యార్థులకు పరిశ్రమ నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. బజా ఎస్ఏఈ ఇండియా ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బాల సుబ్రమ్మణ్యం మాట్లాడుతూ 2007లో ప్రారంభమైన బజా ఎస్ఏఈ ఇండియా ప్రస్తుతం స్వయం ప్రతిపత్తిగల ఎలక్ట్రిక్ వాహనాలను అభివృద్ధి చేసే స్థాయికి ఎదిగిందన్నారు. ఈ సందర్భంగా బజా ఎస్ఏఈ ఇండియా కమిటీ సభ్యుడు జతిన్ గార్గ్ పలువురు విద్యార్థులకు పరిశ్రమల్లో స్పాట్ జాబ్ ఆఫర్లను అందజేశారు.



పాల్గొన్న బజా ఎస్ఏఈ ఇండియా ప్రతినిధులు, అధ్యాపకులు తదితరులు



ఎంఓయూ కుదుర్చుకుంటున్న బీవీఆర్‌ఐటీ కళాశాల యాజమాన్యం

సమస్యల పరిష్కారంలో ముందుంటాం



పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావుతో చర్చిస్తున్న కార్మికనేత మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల సమస్యల పరిష్కారంలో ఐఎన్‌టీయూసీ ముందుంటుందని శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని సబురా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో బుధవారం జరిగిన ప్రమాదంలో రామ్, లక్ష్మణ్ అనే కార్మికులు మృతి చెందారు. ఈ విషయమై వారికి రావాల్సిన పీఎఫ్ విషయమై షాపూర్‌నగర్‌లోని మదన్‌గౌడ్ కార్యాలయానికి గురువారం పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు వచ్చారు. ఈ సందర్భంగా మదన్‌గౌడ్ మాట్లాడుతూ చాలా పరిశ్రమలు కార్మికులకు పీఎఫ్ సదుపాయం కల్పించడం లేదని, దీంతో వారి కుటుంబాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. దీనికి స్పందించిన శ్రీనివాస్ పీఎఫ్ సదుపాయం కల్పించని పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.